సారంగాపూర్: మండల కేంద్రంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు

మెట్‌పల్లి రూరల్: వేంపేట గ్రామంలో..

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లాలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ తీసిన వైద్యాధికారులు, సిబ్బంది

సారంగాపూర్, మే 16: మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో అవగాహన ర్యాలీ తీశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి రాధ, సీహెచ్‌వో కుద్దుస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, మే 16: మండలంలోని వేంపేట గ్రామంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, ఆరబెట్టి మళ్లీ నీళ్లు నింపుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మీర్జా విలాయత్ బేగ్, డాక్టర్ నాగార్జున, హెచ్‌ఈవో రమేశ్, సూపర్‌వైజర్ అచ్యుత్‌రావు, ఏఎన్ఎం సువర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించండి

ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- భూసమస్యలను పరిష్కరించాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష

జగిత్యాల, మే 16: కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు భూ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జగిత్యాల కలెక్టరేట్‌లో పైలెట్ మండలాల్లో భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల నిర్వహణ తీరుతెన్నులు, భూ సమస్యల పరిష్కారం, ఆయా జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై శుక్రవారం రాత్రి ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా, ఈ సమావేశానికి విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో పైలెట్ మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో మంత్రి కలెక్టర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే రెవెన్యూ అధికారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బీ సత్యప్రసాద్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, బీ సత్యప్రసాద్, సందీప్ కుమార్ ఝా, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

పెగడపల్లి, మే 16: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ఇటీవల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య తగ్గిందని, సదుపాయాల గురించి గర్భిణులకు వివరించి ప్రసవానికి వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. వైద్య సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలని, అలాగే డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నరేశ్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొంటాం

జగిత్యాల, మే 16: రైతులు పండించిన ధాన్యం చివరి గింజా వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజా మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రభుత్వం సుమారు 17 వేల కోట్లతో 70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని, అదనంగా సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన 48 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు, వాహనాల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ, కో-ఆపరేటివ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కవికి సత్కారం

రాయికల్, మే 16: భూపతిపూర్ గ్రామానికి చెందిన తెలుగు పండితుడు కామని లక్ష్మణ్ ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రవాదుల దాడిపై డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పహల్గాం శతాధిక కవుల గళం పుస్తకంలో కవిత రాసినందుకు గానూ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో దార్ల వెంకటేశ్వర్ రావు, మామిడి హరికృష్ణ, నామోజు బాలాచారి, కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి

రాయికల్, మే 16: పట్టణంలో అమృత్ జల్ 2.0 పథకాన్ని ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు శుక్రవారం బీజేపీ పట్టణ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ పథకం కింద పట్టణంలోని 12 వార్డులకు గానూ రూ.15 కోట్ల 20 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరై ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదని, భూసేకరణ కూడా చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, సంజీవ్, భూమేశ్, రవి, ఆశన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి, మే 16: మెట్‌పల్లి మైనార్టీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతి తెలిపారు. పట్టణంలోని పలు మసీదుల వద్ద శుక్రవారం స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలు, బూట్లు, బ్లాంకెట్లు, ప్లేట్లు, గ్లాస్, మూడు జతల దుస్తులు, స్పోర్ట్స్ యూనిఫాం, ఆట వస్తువులు, తదితర వాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో సీట్ల భర్తీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మైనార్టీ గురుకులంలో పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.

చిరుతల రామాయణం ప్రదర్శన

కొడిమ్యాల, మే 16: మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ కళా మండలి అధ్వర్యంలో చిరుతల రామాయణ నాటక కళాప్రదర్శన కార్యక్రమాన్ని గ్రామస్తులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో 20 మంది కళాకారులు మూడు రోజుల పాటు చిరుతల రామాయణం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మేడిపల్లి, మే 16: మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మొనుగూరి హన్మంతు, సహాయ కార్యదర్శిగా చిలువేరి గంగాచారి, కౌన్సిల్ సభ్యులుగా రాంపెల్లి రవీందర్, గుగ్గిళ్ల గంగాధర్, మొనుగూరి గంగనర్సయ్య, బెక్కెం గంగారాజం, ఉశకోళ గంగారాజం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

జగిత్యాల టౌన్, మే 16: జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జూపల్లి కిరణ్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, ట్రెజరర్లుగా స్వాతి, సుంకె దేవదాసు, జనరల్ సెక్రటరీగా సురేశ్, జాయింట్ సెక్రటరీగా జగన్నాథరావు, సలహాదారులుగా గంగారాం, శేఖర్, రమేశ్, సోషల్ మీడియా సలహాదారులుగా మధు, ఉపేంద్ర ఎన్నికయ్యారు.

18న రైతులకు శిక్షణ

జగిత్యాల, మే 16: మండలంలోని తాటిపెల్లి సురభి గోశాల ఆవరణలో ఈనెల 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు రైతులకు గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనున్నట్లు గోశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ తురగ రాజిరెడ్డి, బండారి కమలాకర్ రావు తెలిపారు. అనంతపూర్‌కు చెందిన దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిపుణుడు నాగరాజు, ప్రకృతి వ్యవసాయ రైతు, శిక్షకుడు రవీంద్ర నాయక్, మురళీధర గోశాల నిర్వాహకురాలు చెన్నమనేని పద్మ, గ్రామ వికాస ప్రాంత సంయోజకులు జిన్నా సత్యనారాయణ రెడ్డి హాజరై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 94409 50647 సంప్రదించాలని కోరారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తదితరులు

'నమస్తే తెలంగాణ' దినపత్రిక కరీంనగర్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావు కూతురు వివాహం శుక్రవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్‌రోడ్ వద్ద గల వసుధ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వోరుగంటి రమణారావు, తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. **- పెగడపల్లి, మే 16**

ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం సందర్శన

గోదాములో పాఠ్య పుస్తకాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్

జగిత్యాల టౌన్/జగిత్యాల రూరల్, మే 16: జిల్లా కేంద్రంలోని మానస హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ శుక్రవారం సందర్శించారు. వేసవిలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్రాన్ని సందర్శించి, శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఇంత వరకు జరిగిన అంశాల గురించి చర్చించాలని వారిని ప్రశ్నించగా పలువురు పలు సమాధానాలు ఇచ్చారు. రాబోయే విద్యాసంవత్సరంలో ఇట్టి శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అన్వయిస్తూ, అమలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం ధరూర్‌లో విద్యార్థులకు సంబంధించిన ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నాణ్యతతో కుట్టాలని సూచించారు. అలాగే, పాఠ్య పుస్తకాల గోదామును పరిశీలించి, దూర ప్రాంతాలకు మొదట అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, రాజేశ్, మహేశ్, విద్యాశాఖ ఏపీవో రమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

మల్యాల: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మల్యాల, మే 16: పోతారం గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు శుక్రవారం రైతుల చెంతకే వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రజినీకాంత్, సాయినాథ్ మాట్లాడుతూ, రైతులకు సాగునీటి యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విత్తన శుద్ధి, తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకం, విత్తనాల ఎంపిక, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విత్తనాల అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న విత్తనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్, నాయకులు అయిల్నేని సాగర్ రావు, కొల్లూరి గంగాధర్, రైతులు ఆదిరెడ్డి, గంగాధర్, రామారావు, ప్రతాప్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉదయ్, సాయి, స్నిగ్ధ, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్, మే 16: జగిత్యాల మండలం మోతె గ్రామంలో పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ రవి మాట్లాడుతూ, రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువు వాడాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి మాట్లాడుతూ, అవసరం మేరకు రసాయనాలను వాడుతూ నేల, పర్యావరణాన్ని సంరక్షించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి వినీల, ఏఈవో నాగరాజు, ఉద్యాన శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు

సారంగాపూర్, మే 16: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారులు గ్రామంలో రైతు గుర్తింపు కార్డుల కోసం వివరాలు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నందున ఆధార్ కార్డు, ఫోన్ తీసుకొని వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు కార్డు తీసుకున్న రైతులు ఎక్కడైనా బ్యాంకులో రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మెట్‌పల్లి, మే 16: ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన మెట్‌పల్లి పట్టణానికి చెందిన దేవరశెట్టి శ్రీష, చాడ విగ్నేశ్‌ను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోట సుమన్, కిరణ్‌కుమార్, చాడ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి మెరుగైన వైద్యసేవలందించాలి

జగిత్యాల, మే 16: మున్సిపల్ కార్మికుడు పిచ్చుక రామచంద్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరగ్గా ఏఐటీయూసీ అధ్యక్షుడు వెన్న మహేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామచంద్రయ్య మూడు రోజుల క్రితం ప్రభుత్వ దవాఖానలో చేరగా ఇప్పటికీ చికిత్స అందించకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రామచంద్రయ్యకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఈఎస్ఐ దవాఖాన నిర్మించాలని, పారిశుద్ధ్య కార్మికులు రోడ్లపై పని చేసేటప్పుడు సూచికతో కూడిన బోర్డులు ఉంచాలని డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

జగిత్యాల కలెక్టరేట్, మే 16: తాగి వాహనం నడిపిన వ్యక్తికి జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం తెలిపారు. జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఇటీవల వాహనాల తనిఖీలు చేపట్టగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరం పట్టణానికి చెందిన దేవాండ్ల శ్రీధర్‌ను ఆపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా, మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలిందన్నారు. శ్రీధర్‌ను కోర్టులో హాజరుపరుచగా మేజిస్ట్రేట్ ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

రాయికల్, మే 16: రాయికల్ పట్టణంలో నీలి పెద్ద రాముకు చెందిన ఎలక్ట్రిక్ బైక్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. పట్టణంలోని తమ తోట వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన యజమాని బ్యాటరీ స్విచ్ ఆఫ్ చేసినా దగ్ధమైనట్లు తెలిపాడు.

ఉపాధ్యాయుల శిక్షణ వాయిదా వేయాలి

రాయికల్, మే 16: సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే ఉపాధ్యాయుల శిక్షణను వాయిదా వేయాలని టీవైఎంఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఈ-మేయిల్, ఎక్స్ ద్వారా వినతి పత్రం పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20 నుంచి 24 వరకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని షెడ్యూల్ ఇచ్చారని, సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో శిక్షణను వాయిదా వేసి ఈ నెల 27 నుంచి నిర్వహించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయికల్, మే 16: మండలంలోని చింతలూరు మాజీ సర్పంచ్ జటోతు లక్ష్మణ్ నాయక్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు. అలాగే, లింగాపూర్ గ్రామంలో శస్త్ర చికిత్స చేసుకున్న జలపతి, అయోధ్యలో శస్త్ర చికిత్స చేసుకున్న ఎడమల పురుషోత్తం రెడ్డి, పిడుగు రాజిరెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి రాజిరెడ్డి, గుర్రం మహేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, అనుపురం శ్రీనివాస్, జక్కుల సాగర్, బానోతు రమేశ్, ప్రభాకర్, రమేశ్, బాబురావు, మల్లాగౌడ్, రవీందర్, మల్లయ్య గౌడ్, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల/కోరుట్ల, మే 16: మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామంలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, కోరుట్ల పట్టణంలోని బిలాల్‌పురా, ఆదర్శనగర్, అర్బన్ కాలనీ, ఎస్కోనిగుట్ట, రాంనగర్, అల్లమయ్యగుట్ట, వేములవాడ రోడ్డు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామలచ్చక్కపేటలో ఈతవనం దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మే 16: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట గ్రామ శివారులో శుక్రవారం ప్రమాదవశాత్తు ఈతవనం దగ్ధమైంది. సుమారు ఐదెకరాల్లో విస్తరించి ఉన్న మూడువేల ఈత చెట్లు అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైనట్లు గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో బర్రెలు మృతి

పెగడపల్లి, మే 16: పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో మూడు బర్రెలు చనిపోయాయి. కొత్త రవీందర్, వరాల లింగయ్య, కత్తి లచ్చయ్యకు చెందిన ఒక్కో బర్రె మేత కోసం గ్రామ సమీపంలోకి వెళ్లాయి. రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో వైర్లు తెగి కింద పడిపోగా, మేతకు వెళ్లిన బర్రెలకు విద్యుత్ తీగలు తాకడంతో షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ఒక్కో బర్రె విలువ రూ.80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కాగా, ఘటనా స్థలానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, ఆర్ఐ శ్రీనివాస్, విద్యుత్ లైన్‌మెన్ రాంసంజీవ్ వెళ్లి పరిశీలించారు.

మెరుగైన విద్యనందించేందుకు పటిష్ట కార్యాచరణ

జగిత్యాల, మే 16: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేసేందుకు విద్యా శాఖ పటిష్ట కార్యాచరణ చేపట్టిందని కలెక్టర్ బీ సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శుక్రవారం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యా శాఖలో ఒకే రోజు మార్పు సాధ్యం కాదని, నిర్విరామంగా ప్రయత్నం జరుగుతూ ఉండాలన్నారు. టీచర్ వృత్తిలో మనం కొనసాగడానికి ఒకే కారణం ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు మాత్రమేనని, నిరుపేద రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లల జీవితాలను బాగు చేసే అవకాశం మనకు లభించిందన్నారు. సమాజంలో మంచి పునాది ఉండాలంటే ఉపాధ్యాయులు కీలకమన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు ఈనెల 31 వరకు కంటెంట్ ఎన్‌రిచ్‌మెంట్, డిజిటల్ ఎడ్యుకేషన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లైఫ్ స్కిల్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్, తదితర అంశాలపై గణిత, సోషల్ మండల రిసోర్స్ పర్సన్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఐఆర్పీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో ఉపాధ్యాయులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కథలాపూర్, మే 16: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ కోరారు. కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, హెచ్ఎంలు రాజయ్య, సుధాకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, మే 16: యూసుఫ్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, మాజీ సర్పంచ్ గుగ్గిల్ల తుక్కారాంగౌడ్, నాయకులు గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, గంగాధర్, తుక్కారాం, ప్రధానోపాధ్యాయుడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుంతలు తవ్వుతున్నారని ఫిర్యాదు

మల్యాల, మే 16: లంబాడిపల్లి గ్రామ శివారులోని కొంపల్లె చెరువులో మల్యాలకు చెందిన ఓ రైతు గుంతలు తవ్వుతూ మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాడని గంగపుత్ర సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ మునీందర్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో గుంతలు తీయడం వల్ల చేపలు వృద్ధి చెందవని, తద్వారా తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చెరువు శిఖం భూమిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, నర్సయ్య, గంగారాజం, రుత్త కిషన్, గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కొప్పుల పరామర్శ

వెల్గటూర్, మే16: వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిశ్చిత్ వర్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి, మే 16: ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్దండి భూమయ్య, మొనుగూరి హన్మంతు, రాంపెల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

కోరుట్ల రూరల్, మే 16: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌లో గౌడ సంఘం నాయకులు మెట్‌పల్లి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెట్లపల్లి ఆనంద్‌గౌడ్‌ను శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగ్గిల్ల తుక్కారాంగౌడ్, ఎనుగందుల సత్యనారాయణగౌడ్, నాయకులు గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, మే 16: మెట్‌పల్లి ఐఎంఏ జాతీయ వైద్య విధాన రాజ్యాంగ సవరణ, ఆమోదానికి సంబంధించిన నూతన కమిటీ మెంబర్‌గా ఐఎంఏ పట్టణాధ్యక్షుడు డాక్టర్ గంగాసాగర్‌ను నియమించారు. కాగా, శుక్రవారం గంగాసాగర్ దంపతులను మెట్‌పల్లి ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, మే 16: బీర్‌పూర్ మండల తహసీల్దార్ ముంతాజొద్దీన్ బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లగా, శుక్రవారం తహసీల్ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ బొమ్మకంటి శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్, రాహుల్, శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189